# మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి



మల్లన్న ఆలయం గంగరేగు చెట్టు ఆవరణలో భక్తులు

చేర్యాల, డిసెంబర్ 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. కొమురవెల్లి క్షేత్రానికి సుమారు 20వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య తెలిపారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఏఈ బ్రహ్మాండ్లపల్లి అంజయ్య, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

# రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రారంభం



రాజీవ్ ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని ఆవిష్కరించి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 10: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాల్లో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు కార్యక్రమాన్ని అధికారికంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఆదివారం గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, సిద్దిపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్‌తో కలిసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమాను ప్రభుత్వం రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచిందని, పేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ రాము, డాక్టర్ రాజేశ్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి నక్క రాములుగౌడ్, దవాఖాన ఆరోగ్యశ్రీ సిబ్బంది వెంకట్‌రెడ్డి, నర్సింహులు, నరేందర్, గంగాల సురేందర్, సంతోష్, మహేందర్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ పాటించని కాంగ్రెస్ నాయకులు

- పథకాల ప్రారంభోత్సవాన్ని అభాసుపాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం
- ప్రొటోకాల్ ఎక్కడని అధికారులను నిలదీసిన నర్సాపూర్ ఎమ్మెల్యే
- ఎట్టకేలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్, డిసెంబర్ 10: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే నర్సాపూర్‌లో మాత్రం కాంగ్రెస్ నాయకులే ఆ పథకాలను అభాసుపాలు చేసేలా ప్రవర్తించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు ప్రారంభోత్సవాన్ని జాయింట్ కలెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆహ్వానించగా, ఎమ్మెల్యే అక్కడికి రాగానే ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమి చెందిన ఆవుల రాజిరెడ్డి, ఇతర నాయకులు స్టేజ్ పైన కూర్చోవడంతో ఎమ్మెల్యే అసహనానికి గురయ్యారు. శనివారం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కార్యక్రమానికి మహిళా ఎమ్మెల్యేనైన తనను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించలేదని, అధికారులపై మండిపడ్డారు. ఆదివారం కూడా ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నాయకులు స్టేజీపై ఎలా కూర్చుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రశ్నించడంతో అక్కడున్న కాంగ్రెస్ నాయకులు మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా వాగ్వాదానికి దిగారు. ఎంతకూ కాంగ్రెస్ నాయకులు స్టేజీ పైనుంచి వెళ్లకపోవడంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ఏర్పాటు చేసిన స్థలం ప్రజలకు సరిపోకుండా కేవలం కాంగ్రెస్ నాయకులే ఆక్రమించారని ప్రారంభోత్సవాన్ని ప్రజల సమక్షంలో చేసేలా మరో నాడు ఏర్పాటు చేసేలా వాయిదా వేయాలని జాయింట్ కలెక్టర్ రమేశ్‌కు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. కానీ, ప్రారంభోత్సవం ఈరోజే జరగాలని కాంగ్రెస్ నాయకులు మొండికేయడంతో అదనపు కలెక్టర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ఫోన్ చేసి ప్రొటోకాల్ ప్రకారమే సమావేశం నిర్వహిస్తామనడంతో, దీనికి అంగీకరించిన ఎమ్మెల్యే సమావేశానికి రావడంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది. అక్కడ ప్రజలకు కూర్చోడానికి అవకాశం లేకుండా కాంగ్రెస్ నాయకులే ముందు కూర్చోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను ఎమ్మెల్యే మందలించారు. ప్రజలకు అవకాశం ఇవ్వడం లేదని కోపంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఎదుట జాయింట్ కలెక్టర్ రమేశ్, అధికారుల సమక్షంలో ప్రొటోకాల్ ప్రకారం ఎట్టకేలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మచ్చ తెచ్చే మాదిరిగా కాంగ్రెస్ నాయకులు పథకాలకు అడ్డుపడుతూ ప్రవర్తిస్తున్నారని అక్కడున్న నాయకులు చర్చించుకున్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎర్రవల్లి బీఆర్ఎస్ నాయకులు

# ఎర్రవల్లిలో సర్వమత ప్రార్థనలు

మర్కూక్, డిసెంబర్ 10: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఎర్రవల్లి బీఆర్ఎస్ శ్రేణులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఆదివారం గ్రామంలోని సత్య సువార్త సంఘం ఆధ్వర్యంలో చర్చితో పాటు గ్రామదేవత పోచమ్మ, ఇటిక్యాలలోని మసీదులో కేసీఆర్ కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరాజు, భిక్షపతి మాట్లాడుతూ పదేండ్లపాటు తెలంగాణ రాష్ట్రానికి సేవలందించిన కేసీఆర్ తుంటికి గాయమై దవాఖానలో చేరడం బాధాకరమన్నారు. సర్వమత ప్రార్థనలతో కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో దాసు, ప్రభాకర్, విజయ్, అన్వర్, సుధాకర్, యాదగిరి, నవీన్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఇటిక్యాల దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎర్రవల్లి బీఆర్ఎస్ నాయకులు

## రేపు జహీరాబాద్‌లో
# బీఆర్ఎస్ కృతజ్ఞత సభ

హాజరుకానున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 10: శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గెలుపొందడంతో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో సభ నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సభకు వస్తారని, నియోజకవర్గంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

# ఆరుమాసాల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

అందోల్, డిసెంబర్ 10: ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు మాసాల్లో ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. జోగిపేట బస్టాప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి, ప్రయాణికులతో కలిసి కొద్దిదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఎంతో గొప్పగా ఉన్నదన్నారు. మహిళలు ఎలాంటి చార్జీలు లేకుండా రాష్ట్రమంతా పర్యటించవచ్చని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీని రెట్టింపు చేశామని, ఇకపై ప్రతి పేదవాడికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. నియోజకవర్గంలో త్వరలో మరొక 50 పడకల దవాఖాన నిర్మించనున్నామని, దీనిద్వారా ప్రజలకు మ రింత నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అందోల్ నియోజకవర్గం అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యక్రమంలో సం గారెడ్డి కలెక్టర్ శరత్, సీఈవో ఎల్లయ్య, మెప్మా పీడీ గీత, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత, మేనేజర్ ఉపేందర్, ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పార్టీ రాష్ట్ర నాయకురాలు త్రిష, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, శివశంకర్, సత్యనారాయణ, హరికృష్ణగౌడ్, రంగసురేశ్, రేఖప్రవీణ్, నాగరాజు, దుర్గేశ్, ఛందర్‌నాయక్, జడ్పీటీసీలు రమేశ్, అపర్ణ, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకటేశం, రమేశ్‌గౌడ్, నాయకులు సార శివకుమార్, ప్రదీప్‌గౌడ్, మల్లప్ప, ప్రవీణ్ పాల్గొన్నారు.



అందోల్ : జోగిపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మా